

నెంబర్
28
MB
PUBLICATIONS
మధుబాబు

# నెంబర్ 28

రచన

మధుబాబు

---

© Author
© Madhu Baabu
This digital book is published by -

కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# నెంబర్ 28

చెవులు చిల్లులు పడే శబ్దంతో ఇస్లామాబాద్ ఎయిర్ పోర్ట్‌లో లాండ్ అయింది బంగ్లాదేశ్ నుంచి బయలుదేరి వచ్చిన బోయింగ్ విమానం.

నలుగురు ప్రయాణికుల్ని దిగనిచ్చి, ఆ తరువాత మెల్లిగా విమానంలో నుంచి బయటికి వచ్చాడు షాడో. నీలం రంగు ఎయిర్ బేగ్‌ని భుజం మీద వేసుకుని, కస్టమ్స్ కౌంటర్ వున్న బిల్డింగ్ లోకి ఎంటర్ అయ్యాడు.

స్టెన్‌గన్స్ పట్టుకొని యమభటుల మాదిరి నిలుచుని వున్నారక్కడ ఎయిర్ పోర్ట్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్‌కి చెందిన గార్డులు అరడజను మంది. ప్రయాణీకుల్లో ఎవరైనా అనుమానాన్ని కలిగించే విధంగా అగుపిస్తే వెంటనే అరస్ట్ చేసి అవతలికి తీసుకుపోయేటందుకు రెడీగా వున్నారు.

సి.ఐ.బి. స్పెషల్ ఎఫెక్ట్స్ డిపార్ట్‌మెంట్‌కి హెడ్ అయిన అరుణాచలం స్వయంగా తయారు చేసిన పాస్‌పోర్టును కస్టమ్స్ కౌంటర్ మీద పడవేశాడు షాడో. ఎయిర్ బేగ్ జిప్‌ని తీసి కౌంటర్ వెనుక నిలబడివున్న అధికారులకు చూపించాడు.

"యూ కెన్ గో సర్... హేవ్ ఎ ప్లెజంట్ టైమ్ ఇన్ అవర్ కంట్రీ ...." ఎయిర్ బేగ్‌ని, పాస్‌పోర్ట్‌ని నిశితంగా పరిశీలించి తల వూపుతూ పర్మిషన్ యిచ్చాడు ఒక అధికారి.

ఊపిరి బిగబట్టి ముంగాళ్ళ మీద నిలబడివున్నాడు షాడో... అవసరం అయితే ప్రక్కకు జంప్ చేసి ఎయిర్ పోర్ట్ ముందు భాగంలో వున్న పెద్ద ఖాళీ స్థలంలోకి పరిగెత్తేందుకు మార్గాన్ని ఎంచుకుంటున్నాడు.

కష్టమ్స్ ఆఫీసర్ మాటల్ని వినే సరికి గుండెల మీది నించి కొండంత బరువు దిగిపోయిన అనుభూతి కలిగింది అతనికి.

పాస్‌పోర్ట్‌ని పాంట్ జేబులోకి నెట్టి, ఎయిర్ బేగ్‌ని తిరిగి భుజానికి తగిలించుకుంటూ వుండగా మాయం అయిపోయింది ఆ వుత్సాహం. కంటికి కనిపించని ప్రమాదం ఏదో ముందుకు వచ్చేస్తున్నట్లు హెచ్చరికలు పంపించసాగింది అతని సిక్త్‌సెన్స్.

కనుచివరలనుంచి చుట్టూ వున్న జనాల్ని, సెక్యూరిటీ గార్డుల్ని అతి జాగ్రత్తగా పరిశీలిస్తూ ముందుకు అడుగు వేశాడతను.

మరింత అధికారం అయిపోయింది అతనిలోని ఆరాటం.... జరగకూడనిది ఏదో జరుగబోతున్న సెన్సేషన్ ఇంకా ఇంకా బలవత్తరం కాసాగింది.

"ఏమిటి సర్? ఏమయింది మీకు? ఎనీథింగ్ రాంగ్ విత్ యూ??" మనసులోని భావాలు ముఖం మీద ప్రత్యక్షం అయ్యాయి కాబోలు, వెంటనే ఒక అడుగు ముందుకు వేసి అతన్ని పరామర్శించాడు దగ్గర్లో వున్న సెక్యూరిటీ గార్డు ఒకతను.

తన అజాగ్రత్తకు తనను తనే నిందించుకుంటూ తల అడ్డం తిప్పాడు షాడో.

"అరడజనుమంది పిల్లలు భాయీ నాకు.... ప్రార్థనలు చేయగా చేయగా ఆఖర్లో కలిగింది ఆడపిల్ల.... ఎందుకో ఆ పిల్ల ముఖం కనులముందు మెదిలింది... ఒకసారి ఇంటికి ఫోన్ చేస్తే గాని మనసు కుదుట పడేటట్లు కనిపించటం లేదు" తడుముకోకుండా చెపుతూ చుట్టూ చూశాడు.

రాత్రి పగలు తేడా లేకుండా ఇరవై నాలుగు గంటలూ వ్యాపారపు పనుల మీద దేశాలు పట్టుకు తిరిగే ప్రయాణీకుల్ని ఎంతోమందిని ప్రతిరోజూ అక్కడ చూస్తూ వుండటంవల్ల అతిగా ఆశ్చర్యపోలేదు సెక్యూరిటీ గార్డు.

సానుభూతిగా తల వూపుతూ స్వయంగా తీసుకు పోయాడు పాతిక అడుగుల దూరంలో వున్న ఒక టెలీఫోన్ బూత్ దగ్గరికి.

అందమైన మాటలతో అతనికి కృతజ్ఞతలు తెలియ చేసుకుంటూ లోపలికి పోయి, తలుపు మూసుకున్నాడు షాడో. ఎక్కడో బంగ్లాదేశ్ లో వున్న తన కుటుంబానికి ఫోన్ చేస్తున్నట్లు నటిస్తూ, కస్టమ్స్ చుట్టుపట్ల వున్న ప్రదేశాలన్నిటినీ నిశితంగా పరిశీలించి చూశాడు.

అతనితోపాటు విమానం దిగిన ఆఖరి ప్రయాణికుడు కూడా ఫార్మాలిటీలు పూర్తిచేసుకుని ఇవతలికి వచ్చేస్తున్నాడు. దాదాపు ఖాళీ అయిపోయిందా ప్రదేశం.... రెడీగా పట్టుకున్న స్టెన్‌గన్స్‌ని క్రిందికి దించి రిలాక్స్ అవుతున్నారు సెక్యూరిటీ గార్డులు....

అయినా సరే అదేపనిగా వార్నింగ్స్ పంపుతోంది తన అంతరాత్మ.... ఏ క్షణంలోనైనా కొంపలు అంటుకుపోవచ్చని హెచ్చరిస్తోంది....

కంటికి కనిపించని ప్రమాదాల్ని సైతం ముందుగానే కనిపెట్టే తన అంతరాత్మ హెచ్చరికల్ని నెగ్లెక్ట్ చేస్తే ఏంజరుగుతుందో అనుభవపూర్వకంగా తెలుసుకుని వుండటం వల్ల, ఫోన్ బూత్‌లో నుంచి బయటికి వచ్చే ప్రయత్నం వెంటనే చేయలేదు షాడో.

దూరంలో వున్న తన కుటుంబంతో తృప్తితీరా మాట్లాడుతున్నట్లు ముఖం పెట్టి ఆరు నిముషాలు అలాగే వుండిపోయాడు....

అంతకుమించి మరో అర నిముషం వున్నా, సెక్యూరిటీ గార్డులకు అనుమానం కలగటం డెఫినెట్ అని అనిపించి, మెల్లిగా బయటికి వచ్చాడు.

అడుగుకు అరడజనుమంది శత్రువులు అగుపించే ఆ దేశంలోకి పట్టపగలు పదిమందీ చూస్తుండగా ఎంటర్ అవటం వల్ల, తన అంతరంగం అలా హడావుడి పడిపోతున్నదని సరిపెట్టుకుంటూ, ఎయిర్ పోర్ట్ ఎంట్రన్స్ గేటు వైపు బయలుదేరాడు.

పది అడుగులు మాత్రమే వేశాడతను. పదకొండో అడుగు వేయబోతుండగా, ప్రక్కనే వున్న ఒక సెక్యూరిటీ సెల్‌లో నుంచి బయటికి వచ్చి అతన్ని పరికించింది ఒక ముద్దుగుమ్మ.

ఒకసారి చూస్తే మరో పదిసార్లు చూడాలనిపించేటంత ఆకర్షణీయంగా వున్న ఆమె పర్సనాలిటీని గమనించి, అదిరిపడ్డాడు షాడో అప్రయత్నంగా.

భుజానికి తగిలించుకున్న ఎయిర్ బేగ్‌ని క్రిందికి వదిలి, ఒక్కసారిగా పిక్కబలం చూపించాలన్న కోరిక వెంటనే ఎంటర్ అయింది అతని హృదయంలోకి.

పాకిస్థాన్ సీక్రెట్ సొసైటీకి అనుబంధ సంస్థ అయిన స్పెషల్ బ్రాంచిలో అంతకుముందు రెండు నెలల క్రితమే అసిస్టెంట్ డైరెక్టర్ హోదాలో అపాయింట్ చేయబడింది ఆ సుందరి. పేరు నజీమా.

అవసరమైతే ఎటువంటి ఆయుధాలు అందుకోకుండా వట్టి చేతులతోనే పదిమంది బలాఢ్యుల్ని చెల్లా చెదరు చేయగల శక్తి వున్న మార్షల్ ఆర్ట్స్ స్టూడెంట్‌ట ఆమె....

రెండు ఫర్లాంగుల దూరంలో నిలబెట్టిన అగ్గిపెట్టెనయినా సరే గురి తప్పకుండా గాలిలోకి ఎగరవేయగల సూపర్ స్నిప్పర్‌ట....

అన్నిటినీ మించి కంప్యూటర్ వంటి మేధస్సు ఆమె స్పెషాలిటీట..... అమోఘమయిన జ్ఞాపకశక్తి ఆమె సొత్తుట....

సి.ఐ.బి. ఇన్ఫర్మేషన్ డిపార్ట్‌మెంట్ వారు ఆమె మీద తయారుచేసిన అర్జంట్ ఫైలులోని విషయాలు సినిమా రీళ్ళ మాదిరి ఒక్కసారిగా కనులముందు మెదిలేసరికి, విపరీతమైన దాహం వేస్తున్నట్టు ఎండుకుపోయింది షాడో గొంతు.

ఆమె తనను గుర్తుపట్టకుండా వుండాలని, తనకు గుర్తుకువచ్చిన దేవతలనందర్నీ పేరు పేరునా తలుచుకుంటూ, అందమైన స్త్రీ ఎట్టఎదుటికి వచ్చినప్పుడు మగ వాళ్ళందరూ ఎలా నవ్వుతారో, అలాగే తను కూడా నవ్వాడు.

"యూవార్ వెరీ బ్యూటిఫుల్ మేడమ్.... మీ దేశంలోకి అడుగుపెట్టీపెట్టగానే మీ వంటి అందగత్తెల్ని చూడగలగటం అదృష్టంగా భావిస్తున్నాను...." తల వంచుకుని అవతలికి వెళ్ళిపోవటం కంటే, బోల్డ్‌గా ఎదుట నిలబడటమే మంచిదనే నిర్ణయానికి వస్తూ అన్నాడు.

క్రిందినించి పైదాకా అతన్ని పట్టి పట్టి చూస్తున్నది ఆ సుందరి.... ఏదో విషయం జ్ఞప్తికి వస్తున్నట్లు నొసలు విరుస్తున్నది.

ఎదురుచూడని విధంగా అతను తనను పలుకరించేసరికి, ఒక విధమైన సిగ్గుతో ఎర్రగా కందిపోయాయి ఆమె బుగ్గలు.

"ఇది ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ గాబట్టి మీరు ఏం మాట్లాడినా చెల్లుతుంది. సిటీలోకి వెళ్ళిన తర్వాత మాత్రం నోటిని కాస్తంత అదుపులో పెట్టుకోండి.... ఎదుటికి వచ్చిన వాళ్ళందర్నీ ఇప్పుడు నన్ను మెచ్చుకున్నట్లు మెచ్చుకుంటే తప్పుగా అర్థం

చేసుకుని మీ ఆరోగ్యాన్ని చెడగొట్టగలరు" సున్నితంగా, సుమధురంగా హెచ్చరిస్తూ తన దారిన తను వెళ్ళిపోవటానికి సిద్ధమైంది.

మరో నవ్వు నవ్వి ఎంట్రన్స్ వైపు తిరిగాడు షాడో. భుజానికి తగిలించుకున్న ఎయిర్ బేగ్‌ని గట్టిగా పట్టుకుని, వింటినుంచి వెలువడిన బాణంలా సూటిగా దూసుకుపోవటం చాలా మంచిదని అనిపిస్తున్నా, అలాగే మెల్లిగా ముందుకు అడుగువేశాడు.

రెండు అడుగులు మాత్రమే వేశాడతను. మూడో అడుగు వేయకముందే వెనుకనుంచి వినవచ్చింది ఖంగుమంటున్న కంఠం.

"ఒక్కక్షణం ఆగండి మిస్టర్..... మిమ్మల్ని ఎక్కడో చూసినట్లు, మీ గురించి నాకు పూర్తిగా తెలిసివున్నట్లు అనిపిస్తోంది..... ఒక్కక్షణం ఆగి నాతోపాటు మా సెక్యూరిటీ సెల్ లోకి రండి...." అంటూ అతన్ని పిలిచింది నజీమా.

కస్టమ్స్ కౌంటర్ దగ్గిర వున్నప్పుడే తన అంతరాత్మ అదేపనిగా హెచ్చరికలు ఎందుకు మొదలుపెట్టిందో అప్పుడు అర్థం అయింది షాడోకి.

అనుకోని ప్రదేశంలో, అనుకోని విధంగా ఎదురుపడటంవల్ల తనను వెంటనే గుర్తుపట్టలేకపోతున్నది ఆమె. ఆమెతో మరో పది నిముషాల సేపు గడిపితే క్షణాలమీద రట్టు అయిపోతుంది తన గుట్టు. తను చూసిన ఫొటోల్నీ, చదివిన ఫైల్స్ ని అన్నిటినీ వరసపెట్టి జ్ఞప్తికి తెచ్చుకుంటుందామె.... అటునుంచి అటే ఇస్లామాబాద్ సెంట్రల్ జైలుకో, దానికి కొంచెం అవతలగా వుండే మిలటరీ ప్రిజన్‌కో రవాణా చేయించేస్తుంది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=461**